

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ఉండి, గణపవరం మండలాల్లో విషాదఛాయలు

ఉండి: ఉండి మండలంలోని ఉణుదుర్రు జెడ్‌పి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు తోట రత్నకుమార్ (57) ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రత్నకుమార్ భార్య చంద్రకళ అదే పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. రత్నకుమార్ స్వగ్రామం గణపవరం మండలం కేశవరం. చంద్రకళ స్వగ్రామం ఉండి మండలం ఉణుదుర్రు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారని ఎంఇఒ-2 బొక్కా వినాయకుడు తెలిపారు. రత్నకుమార్ కుమారుడు ఐఐటి ఖరగ్‌పూర్‌లో విద్యాభ్యాసం చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుండగా, కుమార్తె విజయవాడలోని ఒక కళాశాలలో బిఎస్‌సి అగ్రికల్చరల్ చదువుతున్నట్లు ఆయన తెలిపారు.

'కూటమి'లో పొలి'ట్రిక్స్'..!

టిడిపి, జనసేన నేతల మధ్య వార్

ఆధిపత్యం కోసం ఇరుపార్టీల నేతలు తహతహ

పలుచోట్ల రోడ్డెక్కిన జనసేన నాయకులు

పదవులు, మద్యం షాపుల కోసం రచ్చరచ్చ

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే బండారం బట్టబయలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి కూటమిలో పొలిటికల్ వార్ రోజురోజుకీ ముదురుతోంది. టిడిపి, జనసేన నాయకులు బహిరంగంగానే నువ్వా.. నేనా అన్నట్లు తలపడుతున్నారు. టిడిపి, జనసేన నాయకుల మధ్య అసలు పొసగని పరిస్థితి ఉంది. రాజకీయంగా పైచేయి సాధించేందుకు ఇరుపార్టీల నేతలు పోటీ పడుతున్నారు. గడిచిన కొద్దిరోజులుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. దెందులూరు, చింతలపూడి వంటి నియోజకవర్గాల్లో జనసేన నాయకులు రోడ్డెక్కిన పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలోనే ఇరుపార్టీల నేతలు విమర్శలకు దిగిన పరిస్థితి. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో టిడిపి కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పోలవరంలో జనసేన అభ్యర్థులు గెలిచారు. కైకలూరులో బిజెపి గెలవగా మిగిలిన ఎనిమిది స్థానాల్లోనూ టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నారు. జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నచోట టిడిపి నేతలు తమను పట్టించుకోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు. టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నచోట తమను పట్టించుకోవడం లేదని జనసేన నేతలు చెబుతున్నారు. తమకు గౌరవం ఇవ్వడం లేదని బిజెపి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో జనసేన ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తమను పట్టించుకోవడం లేదని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఇన్‌ఛార్జి మంత్రి వద్ద గగ్గోలు పెట్టారు. ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు తమను పట్టించుకోవడం లేదని జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ జనసేన నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన సైతం నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి ఉంది. పోలవరం నియోజకవర్గంలో టిడిపి నాయకులకు గౌరవం ఇవ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య పొలిటికల్ వార్ సాగుతోంది. పనుల విషయంలో అధికారులపై ఇరుపార్టీల నేతలు తీవ్రమైన ఒత్తిడి తేవడంతో అధికారులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి ఉంది. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఇటువంటి పరిస్థితి ఉంటే ముందుముందు ఎలా ఉంటుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది.

స్థానిక పదవులు, మద్యం షాపులపై రగడ

కూటమి నేతల్లో ముఖ్యంగా పదవులు, మద్యం షాపులపై తీవ్ర ఘర్షణలు సాగుతున్నాయి. సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాల్లో సాగునీటి సంఘ సభ్యులకు మంచి గుర్తింపు ఉంటుంది. దీంతో సాగునీటి సంఘాల పదవులపై జనసేన, టిడిపిలో తీవ్రపోటీ నెలకొంది. పదవులు తమకు కేటాయించకపోతే పోటీకి దిగుతామని జనసేన నేతలు పలుచోట్ల రెడీ అవుతున్నారు. గ్రామాల్లో చేయాల్సిన పనులకు సంబంధించి సైతం కూటమి పార్టీల్లో పోటీ నెలకొంది. ముఖ్యంగా మద్యం దుకాణాల విషయంలో గొడవలు తారాస్థాయికి చేరాయి. ఆయా పార్టీల నేతలు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఘర్షణలు పడిన పరిస్థితి ఉంది. బెల్టుషాపుల ఏర్పాటులోనూ కూటమిలో ఇప్పటికీ రగడ సాగుతూనే ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి, జనసేన మధ్య రాజకీయ యుద్ధం మరింత తారాస్థాయికి చేరే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇరుపార్టీల నాయకులు ఆర్థికంగా బలపడేందుకు మట్టి, ఇసుక వంటివాటిపై ఆధిపత్యం చెలాయించేందుకు చూస్తున్నారు. ఇటీవల జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హోమ్ మంత్రి పనితీరుపై బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో దిగువస్థాయిలో జనసేన నేతలు దీని అస్త్రంగా చేసుకుని టిడిపి నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమిలో పొలిటికల్ వార్ ఏస్థాయికి చేరుతుందో వేచిచూడాలి.

ఉపాధ్యాయ ఎంఎల్‌సికి 16,316 ఓటర్లు

రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి



మాట్లాడుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తంగా 16,316 మంది ఓటర్లు నమోదయ్యారు. తుది ఓటర్ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. టీచర్ ఎంఎల్‌సికి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. ఈ జాబితాకు సంబంధించి నియోజకవర్గ పరిధిలోని కలెక్టర్ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాలు, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్, ఎంఇఒ, పోలింగ్ స్టేషన్లలో బుధవారం నుంచి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 113 మండలాల్లో మొత్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 9,674 మంది, స్త్రీలు 6,642 మంది ఉన్నారని తెలిపారు. 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 614 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,893 మంది ఓటర్లు, ఏలూరు జిల్లాలోని 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,605 మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు 3,333 మంది ఓటర్లు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు, 3,209 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 3,662 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

11 నుంచి నామినేషన్లు స్వీకరణ

టీచర్స్ ఎంఎల్‌సికి సంబంధించి ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకూ కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ఎన్నికకు సంబంధించి కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల డిఆర్‌ఒలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.

23 వరకూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 23 వరకూ పెంచారన్నారు. ఈ నెల 6తో గడువు ముగిసిందని, దీనికి సంబంధించి 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వస్తుందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 23 వరకూ ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 నవంబర్ ఒకటో తేదీకి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. 15 సంవత్సరాల స్టడీ కంప్లీట్ చేసి ఉండాలని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇప్పటివరకు 1,74,772 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. దీనికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలు , ఏలూరు జిల్లాలో 45 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కాకినాడ డిఆర్‌ఒ జె.వెంకట్రావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ధర్నా



ధర్నాలో నినదిస్తున్న విద్యార్థులు, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దానిలో భాగంగా పెద్దసంఖ్యలో విద్యార్థులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలనీ, డిగ్రీ మేజర్, మైనర్ సబ్జెక్ట్ విధానాన్ని రద్దు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పెండింగులో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రస్తుత మంత్రి నారా లోకేష్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి నిధులు కేటాయిస్తానని, భవన నిర్మాణం పూర్తి చేస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. డిగ్రీలో మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని ఎత్తివేయాలన్నారు. హాస్టల్లో పెండింగ్ మెస్ ఛార్జీలను విడుదల చేయాలని, కాలేజీలు, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, తల్లికి వందనం పథకం వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వై.ఉదయ్, లోకేష్, నవదీప్, ఆదోని తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆపార్‌కు ఆధార్ అనుసంధానం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆపార్‌కు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు ఈ సందర్భంగా ఆపార్ (ఆటోమేటెడ్ ఐడి పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్టర్) నమోదులో భాగంగా ఇంటర్ వరకు చదువుకున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆధార్‌లోని వివరాలు, పాఠశాలలో రిజిస్ట్రేషన్ లోని వివరాలు, యు-డైస్ ప్లస్‌లోని వివరాలు ఒకేలా ఉండాలన్నారు. ఒకవేళ అటువంటి వ్యత్యాసాలు ఏవైనా ఉంటే సరిచేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరుపట్టీని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో పారిశుధ్యం, తాగునీరు, మధ్యాహ్నం భోజన పథకం తీరును ఆమె పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు అందజేసేలా ఉపాధ్యాయులు తరచూ భోజనాన్ని తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయుడు కె.కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహశీల్దారు జివి.శేషగిరి, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ సురేంద్రబాబు, డిఇ తాతబ్బాయి ఉన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి: కలెక్టర్ ఆదేశం

ఏలూరు కొత్తపేట ప్రాంతంలోని 41, 42 డివిజన్లకు సంబంధించిన వార్డు సచివాలయాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధుల నిర్వహణలో ఎటువంటి లోపమూ లేకుండా సమర్థవంతంగా సేవలందించాలన్నారు. ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. వాటర్, ఇంటిపన్ను వసూళ్ల తీరును సంబంధిత రిజిస్టర్ ద్వారా పరిశీలించారు. పారిశుధ్యం విషయంలో సంబంధిత సచివాలయ సిబ్బంది రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చిన సమస్యను వెంటనే పరిష్కరించి చూపాలని ఆదేశించారు. అన్నిచోట్లా వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయం ద్వారా అందిస్తున్న సేవల ద్వారా వచ్చిన నగదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత నగదును వసూలు చేసిన 24 గంటల్లో బ్యాంకులో జమ చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా ప్రవర్తించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ధాన్యం సమస్యలపై ఫోన్ కొట్టండి

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

గోనె సంచులకు కొరత లేదు

సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి



మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, కొనుగోలులో సమస్యలు ఏర్పడితే కంట్రోల్ రూమ్ నెంబర్ 7702003584కు ఫోన్ చేస్తే సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 750 మంది సిబ్బందిని నియమించి శిక్షణ అందించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 11 రైతు సేవాకేంద్రాల ద్వారా రూ.1.22 కోట్ల విలువైన 610 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు రైతు ఖాతాలో సొమ్ము జమ చేస్తామన్నారు. అత్యధికంగా ధాన్యం పండించే మండలాలైన భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, నిడమర్రు, పెదపాడు మండలాల నుంచి ధాన్యం కొనుగోళ్లు జరిగాయన్నారు. తేమ 17 శాతంలోపుగా నిర్ణయించినట్లు తెలిపారు. తేమ శాతం విషయంలో ఎటువంటి సమస్యల్లేకుండా అన్నిస్థాయిల్లో చర్యలు తీసుకున్నామన్నారు. రైతుసేవా కేంద్రాల్లో, మిల్లుల వద్ద ఒకేరకమైన తేమ నిర్ధారణ మీటర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎక్కడైనా సమస్య వస్తే పరిష్కరించేందుకు రైతులు, మండల వ్యవసాయ శాఖ అధికారి, తహశీల్దారుతో కూడిన కమిటీ పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. ధాన్యం కొనుగోలుకు ఈ సీజన్‌లో 80 లక్షల గోనె సంచులు అవసరమవుతాయని అంచనా వేశామని, ఇప్పటికే 64,84,352 గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. వీటిని రైతుసేవా కేంద్రాలు, గొడౌన్లు, మిల్లుల్లో ఉంచామన్నారు. గోనె సంచుల నాణ్యత విషయంలో ప్రతి మిల్లుకూ ఇద్దరు కస్టోడియన్లను ఏర్పాటు చేసి అక్కడున్న ప్రతి సంచినీ పరిశీలించి చెడ్డగా ఉన్నవాటిని తొలగించామన్నారు. సేకరించిన ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్‌ను ఏర్పాటు చేశామన్నారు. రైతులు తమ దగ్గర ఉన్న ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను రిజిస్టర్ చేసుకుని వినియోగించుకోవచ్చని, వాటికి అవసరమైన జిపిఎస్ పరికరం కూడా ఎటువంటి ఖర్చు లేకుండా శాఖాపరంగా అమరుస్తామన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. దిగుమతి ఆలస్యమైతే వెంటనే తెలిసిపోతుందన్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచే చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. రైతులు ఎటువంటి సొమ్మూ ఇవ్వనక్కర్లేదన్నారు. దీపం పథకం-2కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకూ 72 వేల మంది బుకింగ్ చేసుకోగా 63 వేల మందికి సిలిండర్లు డెలివరీ చేయాలని తెలిపారు. ఖాళీ సిలిండర్లు అందుబాటులో లేకుండా బుకింగ్ చేయవద్దన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు బుక్ చేసుకునే అవకాశం మార్చి వరకు ఉందన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని చెప్పారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవికరాణి తదితరులు పాల్గొన్నారు.

వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు రెవెన్యూ శాఖ సర్వే

ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో రైల్వేట్రాక్, జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు రెవెన్యూ శాఖ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ఏలూరు ఎంపీ చొరవతో స్పందించిన జాతీయ రహదారుల శాఖ నియోజకవర్గ పరిధిలో ఆరు చోట్ల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసిందన్నారు. ఈమేరకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 216 ఎ జాతీయ రహదారి వెంబడి హద్దులు నిర్ణయించాలని జాతీయ రహదారుల శాఖ కోరారని ఆర్‌డిఒ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం భీమడోలు మండల పరిధిలోని భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల ప్రాంతాలలో సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఒకవైపు రైల్వేట్రాక్, మరోవైపు ఏలూరు కాలువ ఉన్న నేపథ్యంలో రోడ్డు ఓవర్ బ్రిడ్జి, ఫ్లై ఓవర్, అండర్ రోడ్డు పాస్ నిర్మాణాలను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. దీనిలో భాగంగా రెవెన్యూ శాఖ హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేపట్టిందని, దీని ఆధారంగా తదుపరి కార్యక్రమాన్ని జాతీయ రహదారుల శాఖ చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.

పాతూరు గోదాముల పరిశీలన

ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ బుధవారం మండలంలోని పాతూరు గోదాముల వద్ద పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. దీనిలో భాగంగా రిజిస్టర్ల పరిశీలన, రికార్డుల తనిఖీ చేశారు. పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న బియ్యం విషయమై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ రమాదేవి, సర్వేయర్ ధర్మారావు పాల్గొన్నారు.



జాతీయ రహదారుల హద్దులు నిర్ణయించే సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

మహిళల భద్రత కోసం 'అభయ'

ఎంతో గర్వించదగ్గ విషయం : ఏలూరు రేంజ్ డిఐజి ఐజి అశోక్ కుమార్



అభయ లోగో ఆవిష్కరిస్తున్న డిఐజి అశోక్‌కుమార్, కలెక్టర్, ఎస్‌పి, జెసి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మహిళల భద్రత కోసం ఏర్పాటు చేయబడిన అభయ లోగోను ఆవిష్కరించడం ఎంతో గర్వించదగ్గ విషయమని, మహిళలకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తుందని ఏలూరు రేంజ్ డిఐజి ఐజి అశోక్ కుమార్ తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ అనుసంధాన పోలీసు మైదానంలో జిల్లా ఎస్‌పి ప్రతాప శివ కిషోర్ ఆధ్వర్యంలో అభయ లోగోను ఆవిష్కరించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేయబడిన ఈ అభయ అనే కార్యక్రమం 'అభయ మీ రక్షణ మా కర్తవ్యం' అనే నినాదంతో ఏర్పాటు చేయబడిన లోగోను ఆవిష్కరించేందుకు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఆహ్వానం మేరకు ఏలూరు రేంజ్ డిఐజి ఐజి జివిజి అశోక్ కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి, అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు సంయుక్తంగా ఈ లోగో ఆవిష్కరణకు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అభయ యాప్‌కు సంబంధించిన డిస్‌ప్లే డెమోను వారు చూశారు. అనంతరం మహిళల భద్రత కోసం నిరంతరం తాము కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఐజి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో అభయ మహిళా సేఫ్టీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో జిల్లా ఎస్‌పిని అభినందించారు. పోలీసు వ్యవస్థలో 30 శాతం మహిళా పోలీస్ సిబ్బంది పనిచేస్తున్నట్టు, మహిళా సేఫ్టీలో మహిళా పోలీసులు, గ్రామ మహిళల సంరక్షణ కార్యదర్శులందరూ గస్తీలు నిర్వహిస్తూ కాలేజీలు, హాస్టల్స్, బస్టాండ్ వద్ద ఆకతాయిల వేధింపులు గురిచేసేటువంటి ప్రదేశాలలో గస్తీ తిరుగుతూ అసాంఘిక కార్యకలాపాలన నిర్మూలనకు పాటుపడాలన్నారు. నేటి సమాజంలో సోషల్ మీడియా ద్వారా అనేక రకాల అనర్థాలు జరుగుతున్న నేపథ్యంలో అపరచిత వ్యక్తుల వద్ద నుంచి వచ్చే మెసేజ్లను, లింకులను వాడకూడదని అవగాహనా సదస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభయ యాప్‌ను ప్రవేశపెట్టిన ఎస్‌పిని అభినందించి పోలీస్ డిపార్ట్మెంట్లకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. జెసి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని, ఈ అభయ యాప్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

జిల్లాలో మహిళల భద్రతకు ప్రత్యేకమైన ఫోన్ నెంబర్ 9550351100ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి అడ్మిన్ ఎన్.సూర్య చంద్రరావు, ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ కుమార్, ఎఆర్‌ఆర్‌ఐ పవన్ కుమార్, ఏలూరు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ వైవి.రమణ పాల్గొన్నారు.

ఐటి దాడుల కలకలం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆదాయపు పన్ను శాఖాధికారుల సోదాలతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంటికి సెంట్రల్ ఐటి అధికారులు బుధవారం ఉదయం 11 గంటలకు చేరుకుని తనిఖీలు చేపట్టారు అయితే అధికారులు స్థానిక పోలీసుల సహకారం తీసుకోలేదు. సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది సహకారంతోనే ఈ తనిఖీలు చేపట్టడం గమనార్హం. ఈ తనిఖీ బృందానికి ఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్నారు. అయితే నూకల రామకృష్ణ స్థానికంగా ఒక బ్యాంకును కూడా నిర్వహిస్తున్నారు. నాగ హనుమాన్ ఆయిల్ పేరుతో ఆయన నూనె వ్యాపారం చేస్తున్నారు. దీంతోపాటు ఆయనకు రైస్ మిల్లులు, ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ప్రస్తుతం రామకృష్ణ అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమారుడు సమక్షంలో ఐటి అధికారులు వంటనూనె ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి తనిఖీ అధికారులు అధికారికంగా ఇప్పటి వరకూ ఏమీ ప్రకటించలేదు.

14 నుంచి గురుకుల పాఠశాలల

జోన్-2 బాలికల ఆటల పోటీలు

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం (బాలికలు) పాఠశాల వేదికగా ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు గురుకుల పాఠశాలల జోన్-2 స్థాయి బాలికల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వివి.రమణ తెలిపారు. దీనిలో జోన్-2 పరిధిలోని ఉమ్మడి గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా జిల్లా పరిధిలోని 29 పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల్లో ఆరు గేమ్స్, చెస్, క్యారమ్స్‌తోపాటు స్పోర్ట్స్ విభాగానికి చెందిన వివిధ రన్నింగులు, జంప్‌లు ఉంటాయని ప్రిన్సిపల్ తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ముసునూరు : మండలంలోని లోపూడి గ్రామంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, బుధవారం టిడిపి నాయకులు ఆ రోడ్డుకు తూరుల వేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వేంపాటి శ్రీనివాసరావు, చలమాల వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు, లక్ష్మమాల కాంతారావు, నక్క చెన్నారావు, వెంకటరత్నం రోడ్డు నిర్మాణ పనిలో భాగస్వాములయ్యారు.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు, బ్యాగుల బహూకరణ

చింతలపూడి : చిన్నతనం నుంచి చదువుపై ఆసక్తి పెంచుకోవాలని దాతలు అన్నారు. ఐసిడిఎస్ చింతలపూడి ప్రాజెక్ట్ ఎర్రగుంటపల్లి సెక్టార్ ఎర్రగుంటపల్లి కోడ్ నెంబర్ 05 అంగన్వాడీ కేంద్రానికి దాతలు అడపా శ్రీనివాస రెడ్డి, గోలి సత్యనారాయణ రెడ్డి, కొక్కిరి గడ్డ జయరాజు, ఎర్రమల వెంకటేశ్వరరావు కుర్చీలు, చాపలు, పలకలు, స్కూల్ బ్యాగ్స్, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్ బహూమతులు అందజేశారు. ఈ బహూమతులు దాతల కోరిక మేరకు గ్రామ పెద్దలు పుల్లూరి శ్రీరామాచార్యులు చేతుల మీదుగా పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్.ఎం.రాజశేఖర్, స్వరూప రాణి, సెక్టార్ సూపర్వైజర్ ఇ.మరియమ్మ, జి.ఎంఎస్.శ్రీదేవి, లక్ష్మీ, అంగన్వాడీ వర్కర్ రాచప్రోలు మరియమ్మ, వర్కర్ వెంకటేశ్వరమ్మ, ప్రీ స్కూల్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఆర్‌డిఒ, బ్లాక్ స్పాట్ పరిశీలన

ఉంగుటూరు : జాతీయ రహదారి కైకరం వద్ద నుంచి ఉంగుటూరు వరకు ప్రమాదాలకు నిలయంగా ఉన్న బ్లాక్‌స్పాట్స్, హైవే, రైల్వే హద్దులను ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ బుధవారం పరిశీలించారు. కైకరం వద్ద నిర్మించనున్న ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి సంబంధించిన హైవే అధికారులకు చెందిన భూమి, ప్రయివేటు భూముల హద్దులను పరిశీలించారు. అనంతరం చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరులో ప్రమాద స్థావరాలను(బ్లాక్ పాయింట్స్) గుర్తించిన ప్రదేశాలను పరిశీలించారు. ఉంగుటూరు డిటి వై.పూర్ణచంద్రరావు, హైవే, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

బుట్టాయగూడెం : అరకు ఎన్నికల సభలో నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎన్నికల హామీని అమలు చేయాలని ఆదివాసీ ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. బుధవారం స్థానిక రామన్నదొరయ్య భవనంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం భాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసీ, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక ఆదివాసీలకు నూరుశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌తో పాటు ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో టీచర్ పోస్టుల భర్తీకి పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి దర్శుల రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కారం రాఘవ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

పెదపాడు : పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో ఉన్న గంగిరెద్దుల కుటుంబాల వారికి దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ద్వారా నిత్యవసర సరుకులను అందించారు. ముఖ్యంగా గత ఆగస్టులో సంభవించిన తుపానుకు రోడ్డు పక్కన దేరాలలో నివసిస్తున్న వారి కుటుంబాలకు సహాయార్థం ఒక్కొక్క కిలో బియ్యం ప్యాకెట్, 11 రకాల నిత్యవసర వస్తువులతో కూడిన కిట్స్ 32 కుటుంబాల వారికి అందించారు. ఈ కార్యక్రమంలో బలహీన వర్గాల వారిని ఆదుకోవటమే డిబిఆర్‌సి కర్తవ్యంగా భావిస్తుంది. దీనిలో భాగంగా ర్యూర్స్ రాణి ఫౌండేషన్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, డిఎన్‌టి కుటుంబాలకు చెందినవారు ఉన్నారో వారిని గుర్తించి వారికి జీవనోపాధులకు కార్యక్రమాలను నిర్వహించడం, అనుకోకుండా వాతావరణ విపత్తుల కాలంలో వారిని ఆదుకోవడం డిబిఆర్‌సి చేయదున్న కార్యక్రమాలలో ముఖ్యమైనవని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్‌ఓ శర్మ, పార్టీ ప్రెసిడెంట్ అశోక్, సత్యనారాయణ, దుర్గారావు, సామ్సన్ పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో పెరటి కోళ్ల పంపిణీ

పోలవరం: మండలంలోని కొండ్రుకోట పునరావాస కాలనీలో ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులతో వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ వైఎస్‌ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో బుధవారం 74 కుటుంబాలకు మెరుగైన పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఒక్కో కుటుంబానికి 5 కోళ్లు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ పోలవరం జాతీయ ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా సొంత గ్రామాలను విడిచి బయటికి వచ్చి పునరావాస కాలనీల్లో జీవిస్తున్న గిరిజన ప్రజల జీవన విధానం, అదనపు ఆదాయం మెరుగుపరచడంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఈ పెరటి కోళ్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవి వరప్రసాద్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంపిటిసి, పి.సత్యనారాయణ దొర పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ముసునూరు : మండలంలోని బలివే గ్రామంలో బెల్ట్ షాపులో దాడులు జరిపి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఏలూరు నార్ ప్రభుకుమార్ వారి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న బలివే గ్రామానికి చెందిన చిల్లిముంత సీతారామయ్య నుంచి లక్ష్యయ్య వద్ద 15 మద్యం సీసాలను స్వాధీన పరుచుకుని, ఆదివేంకుల యల్లాపురం గ్రామానికి చెందిన వీరంకి నాగరాజు తండ్రి గోపయ్య వద్ద 50 మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు మస్తానయ్య తెలియజేశారు. నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాలలో బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపైన, నాటు సారా తయారుచేసిన, అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మస్తానయ్య తెలిపారు. నాటుసారా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం సప్లై చేసే బెల్లం వ్యాపారులపైన, నాటుసారా తయారీకి ఉపయోగించు బెల్లపు ఊట కలిగి ఉన్న భూ యజమానులపైన కూడా కేసులను నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వైఎస్‌ఎస్‌.పి.ఈ. శరత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

చింతలపూడి: అక్రమంగా అమ్ముతున్న నాటుసారాని పట్టుకున్నట్లు చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి మండలం రామచంద్రాపురం గ్రామంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించగా రాఘవపురం గ్రామంలో ఇంజుమూడి వెంకటరమణ అను మహిళ వద్ద 15 లీటర్ల నాటు సారాయితో అదుపులోకి తీసుకుని స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడిలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని పొనుకుమాడు గ్రామంలో పాత బెల్ట్ షాపు కేసులో నిర్బంధంలో ఉన్న గరికాడి అఖిల్ కుమార్ ను సెక్షన్ 129 బిఎన్‌ఎస్‌ఎస్ 2023 చట్టం ప్రకారం చింతలపూడి తహశీల్దార్ ఎదుట బైండ్ ఓవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో స్థానిక చింతలపూడి ఎక్సైజ్ ఎస్‌ఐలు ఆర్‌వి.ఎల్.నరసింహారావు, అబ్బులి బేలీ, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జీలుగుమిల్లి : గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని దర్భగూడెంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కె.రామకృష్ణ(55) తన పని ముగించుకొని జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు గుర్తించి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కానిస్టేబుల్ రాధాకృష్ణ తెలిపారు.

జెసిబి సీజ్


ఉంగుటూరు : గోపీనాథపట్నంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన భూమిలో మట్టిని అక్రమంగా తవ్వుతున్న జెసిబిని గోపీనాథపట్నం రెవెన్యూ అధికారి టేకి దుర్గాప్రసాద్ బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. జెసిబిని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. గత ప్రభుత్వంలో గోపీనాథపట్నం కొత్తగూడెం దారిలో ఎల్లమ్మ ఆలయం సమీపంలో ప్రభుత్వ పోరంబోకు భూమిని పేదల కోసం కేటాయించింది. గత ప్రభుత్వ నిధులతో మెరక చేశారు. ఆ మెరక మట్టిని మట్టి మాఫియా అక్రమంగా తవ్విస్తున్నారని స్థానికులు అర్ధరాత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. డిటి పూర్ణచంద్రరావు ఆదేశాలతో వీఆర్‌ఓ, సిబ్బంది పోలీసుల సహకారంతో జెసిబిని పట్టుకున్నారు. వీఆర్‌ఓ ఇచ్చిన రిపోర్టు మేరకు ఆ తదుపరి చర్యలు తీసుకుంటామని పూర్ణచంద్రరావు ప్రజాశక్తికి వివరించారు.

అంబేద్కర్ విగ్రహం పాక్షికంగా ధ్వంసం

చిన వెల్లమిల్లిలో ఘటన

ప్రజాశక్తి - ఉంగుటూరు

అంబేద్కర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని చిన వెల్లమిల్లి గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెల్లమెల్లి పంచాయతీ శివారు చిన వెల్లమిల్లి గ్రామంలో సుమారు 10 సంవత్సరాల క్రితం అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని మంగళవారం అర్ధరాత్రి కొంతమంది గుర్తుతెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహం చేతి వేలును ధ్వంసం చేశారు. ఉదయం ఈ విగ్రహం ధ్వంసం కావడాన్ని జై భీమ్ నాయకులు గుర్తించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయాలని దళితులు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని, నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న చేబ్రోలు ఎస్ఐ సూర్య భగవాన్, ఉంగుటూరు డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు ఆధ్వర్యంలో పలువురు విఆర్ఒలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎస్ఐ దళిత నాయకులతో గ్రామ మాజీ సర్పంచి మెడవంకల రత్తయ్యతో మాట్లాడారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ హామీ ఇచ్చారు. మద్యం సేవించి శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని, అటువంటి వారు ఎవరైనా ఉంటే తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. మాజీ సర్పంచి రత్తయ్య మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను పట్టుకోవాలని కోరారు. అనంతరం విగ్రహాన్ని ధ్వంసం చేసిన చోట సిమెంటుతో అతికించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలదండలు వేసి ఘన నివాళులు అర్పించారు.



ధ్వసమైన విగ్రహం వద్ద గ్రామస్తులు

మెప్మా ఆర్‌పిల వేతన బకాయిలివ్వాలి

సిఐటియు ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి పట్టణ మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కి మూడు నెలల జీతం వెంటనే అందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. చింతలపూడి పట్టణంలో బుధవారం మెప్మా రిసోర్స్ పర్సన్స్ తమ డిమాండ్ల సాధనకు మెప్మా అధికారి టిఎంసి ఎమ్.రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మూడు నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని, ఉద్యోగ కాలపరిమితి ఎత్తివేయాలని, ఆర్పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇ.ఝాన్సీ, బి.కృష్ణవేణి, జస్వింత, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పెదపాడు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని పెదవేగి సిఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పెదపాడు సెయింట్ అగస్టిన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 33వ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పెదవేగి సిఐ కె.వెంకటేశ్వరరావు, పెదపాడు ఎస్ఐ కట్ట శారద సతీష్ ఒలింపిక్ లాంప్‌ను వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జెసింతసులయ పాల్గొన్నారు.

ఎస్‌సి శ్మశాన వాటికలో సీసీ రోడ్డు నిర్మాణం

ఉంగుటూరు : నారాయణపురం ఎస్‌సి శ్మశాన వాటికలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న ఈ పనులను రెండు రోజుల నుంచి చేస్తున్నారు. సర్పంచి అలకనంద, ఉప సర్పంచి మరడ సాంబశివరావు, వార్డు సభ్యులు ఆశీర్వాదం, గంగాధరరావు, ఎంపిటిసి మండల ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు పాల్గొన్నారు.

కైకరంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం

ఉంగుటూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జిఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14 బాల బాలికల రెండు రోజుల పాటు జరిగే అథ్లెటిక్స్ బుధవారం కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో తాడేపల్లిగూడెం డివైఇఒ ఎన్.రవీంద్రభారతి ప్రారంభించారు. రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి వందలాది మంది క్రీడాకారులు వచ్చారు. తొలిరోజు లాంగ్ జంప్, హై జంప్, డిస్క్‌త్రో, జావలిన్‌త్రో పోటీలు నిర్వహించారు. హై జంప్‌లో విజేతలుగా బాలికలు బి.ఇషానా వైజాగ్, సిహెచ్.భావన ఈస్ట్ గోదావరి, కె.లక్ష్మీ ప్రియా చిత్తూర్, బాలురు వి.రాఘవేంద్ర విజయనగరం, డి.రహీం ప్రకాశం, కె.రాఘవేంద్ర వైఎస్ఆర్ కడప. లాంగ్ జంప్ బాలురు ఎం.పెంచల్ బాబు, వైఎస్ఆర్ కడప, పి.రాజేష్ విశాఖపట్నం, డి.వెంకట శివ ప్రకాశం, బాలికలు జి.కొండల లక్ష్మి ఈస్ట్ గోదావరి, ఎం.రిషిత కర్నూల్, పి.మానసా శ్రీకాకుళం. జావలిన్‌త్రో విజేతలు బాలురు జి.చంద్రశేఖర్ నాయుడు విశాఖపట్నం, బి.భరత్ చంద్ర శ్రీకాకుళం, వి.గణేష్ శ్రీకాకుళం, బాలికలు ఎం.కరిష్మా గుంటూరు, పి.రితిక నెల్లూరు, డి.లాస్య చిత్తూర్. డిస్క్‌త్రో బాలురు జి.చంద్రశేఖర్ నాయుడు విశాఖపట్నం, బి.వెంకటేష్ కర్నూలు, టి.విన్సెంట్ ప్రకాశం విజేతలుగా నిలిచారు.

డిడియు-జికెవై స్కీం కింద ఉపాధి నైపుణ్య శిక్షణ

ఏలూరు : గ్రామీణ పేద యువతకు డిమాండ్ ఉన్న నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి మార్గం చూపించేందుకు డిడియు-జికెవై శిక్షణ ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వట్లూరులోని టిటిడిసిలో ఉన్న సిడాప్ శిక్షణా కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్యయోజన(డిడియు-జికెవై), సిడాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఏ రూపాన, ఏ సమాచారంతో హాజరైంది వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ కార్యక్రమం కింద 2024-25లో రెండు వేల మంది నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న యువతులతో స్వయంగా కలెక్టర్ మాట్లాడి వారి బాగోగులు, భోజన వసతి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న యువతులతో మాట్లాడుతూ ఉపాధిమార్గం చూపించే ఆశయంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా సమర్ధవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ అనంతరం సాఫ్ట్‌వేర్ కంపెనీలు, లలితాజ్యూవెల్లరీ, జాయ్‌లుకాస్, టాటా, మొదలైన కంపెనీల్లో ఇప్పటికే కొంతమంది పనిచేస్తున్నారన్నారు. హోటళ్లు, పర్యాటక కేంద్రాలు, తదితర కంపెనీల భాగస్వామ్యంతో శిక్షణ పొందిన వారికి కనీస వేతనం రూ.15 వేలు ఉండేలా ప్లేస్ మెంట్ కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయరాజు మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమ సిలబస్‌ను వివరించారు. శిక్షణ పొందుతున్న వారిలో ఉపాధి హామీ చట్టం కార్మికుల కుటుంబాల్లోని పిల్లలు ఉన్నారన్నారు. వీరికి శిక్షణ ఇవ్వడం ద్వారా పలు ప్రయివేట్ కార్పొరేట్ సంస్థలందు ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో పెదపాడు తహశీల్దారు కృష్ణజ్యోతి, ఎంపిడిఒ అమీలు జామ, జెడిఎం పార్థసారధి, ట్రైనర్ సురేష్ పాల్గొన్నారు.

యాంత్రీకరణ ద్వారా పొగాకు నాట్లు

జీలుగుమిల్లి : మారుతున్న కాలానికి అనుగుణంగా కూలీల అవసరం లేకుండా యాంత్రీకరణ ద్వారా పొగాకు నాట్లు వేయడం ద్వారా కూలీల ఖర్చు తగ్గించవచ్చని సిటిఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు. పొగాకు పంట సాగులో శాస్త్ర సాంకేతిక వినియోగంలో భాగంగా పొగాకు మొక్కలను యంత్ర సహాయంతో నాటే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు సాగులో కూలీల వినియోగం తగ్గించి యాంత్రీకరణ ద్వారా సాగుచేయడం ద్వారా సాగు వ్యయం తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం భోపాల్‌లో కేంద్ర పొగాకు పరిశోధనా కేంద్రంలో రూపొందించిన పొగాకు మొక్కలు నాటే యంత్రంలో జరిగే పలురకాల మార్పులను ప్రధాన శాస్త్రవేత్తలకు సూచించారు. అనంతరం కేంద్ర పరిశోధనా కేంద్రంలో ఆరు పొగాకు బ్యారన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సిటిఆర్ఐ క్రాప్ మేనేజ్మెంట్ హెడ్ డాక్టర్ రాజశేఖర్ రావు పాల్గొన్నారు.

వర్ణపట శాస్త్రంపై అవగాహన

డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కెమిస్ట్రీ విభాగ ఆధ్వర్యంలో వర్ణపట శాస్త్ర అనువర్తనాలు అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు వర్ణపట శాస్త్రంపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ విభాగ అధ్యాపకుడు డాక్టర్ కొత్తపల్లి రవీంద్రబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి మెడికల్ పరీక్షలు, పరిశ్రమలలో వివిధ నమూనాలను వర్ణపట శాస్త్రం ద్వారా నిర్ధారణ చేసే విధానం గురించి పరిశోధనాత్మకంగా వివరించారు. అనంతరం ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు అందరూ కలిసి రవీంద్ర బాబుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్ర కుమార్, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ ఎవిఆర్, డాక్టర్ బి.లవకుశ, డి.విన్నీ తేజ, ఐక్యు ఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ ఆశిమ్, వివిధ విభాగ అధిపతులు వి.మదన్మోహన్, డాక్టర్ డి.దేవానందం, బి.శ్రీనివాసరావు, డాక్టర్ అంజాద్ ఆలీతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.


'ఆశ్రం శ్రేయస్సు' ప్రారంభం

ఏలూరు సిటీ : ఆశ్రం విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గోకరాజు గంగరాజు ఆదేశాల మేరకు ఆశ్రమ హాస్పిటల్స్‌లో శ్రేయస్సు అనే నూతన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆశ్రమ హాస్పిటల్స్ సిఇఒ డాక్టర్ హనుమంతరావు బుధవారం తెలియజేశారు. సిఇఒ హనుమంతరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా రోగుల్లో భయాందోళన తొలగించి, తద్వారా పూర్తిస్థాయి వైద్య సేవలు పొందేలా చేయడమే ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. ఈనెలలో పలు కేన్సర్ అవగాహనా దినోత్సవాలు ఉండడంతో ముందుగా కేన్సర్ రోగులకు స్వాంతన పరిచే విధంగా ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందని తెలియజేశారు. మనోబలానికి మించిన మందు లేదు అనే విధంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో పలువురు కేన్సర్ విజేతలు పాల్గొన్నారు. వారు అమ్మ జన్మనిచ్చింది, ఆశ్రమ పునర్జన్మనిచ్చింది అంటూ పలువురు కేన్సర్ విజేతలు వారి భావోద్వేగాలను పంచుకున్నారు. కేన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ శైలజ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి నిశ్శబ్దంగా ప్రబలుతోందని, జాతీయస్థాయిలో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్లు ముఖ్య ప్రాధాన్యత కలిగి ఉన్నాయని అన్నారు. వాటి గురించి అవగాహన కల్పించే దిశగా ఆశ్రమ హాస్పిటల్స్ పనిచేస్తుందని తెలియజేశారు. ప్రాథమిక కేన్సర్ నిర్ధారణా పరీక్షల ద్వారా ముందుగా గుర్తించే అవకాశం ఉందని తెలియజేశారు. డాక్టర్ సింధు, డాక్టర్ కన్మణి, గ్రూప్ సిఒఒ రాజన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి లాభాలను పొందాలని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ రైతులకు సూచించారు. మండలంలోని బొమ్మినంపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఎ డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని, రైతులకు రాష్ట్రంలో, కేంద్రంలో కూటమి ప్రభుత్వాలు పెద్ద పీట వేసిందన్నారు. రైతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి లాభసాటి పంటలను పండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

విఒఎలపై వేధింపులు, తొలగింపులు దుర్మార్గం

సిఐటియు ఆధ్వర్యాన వెలుగు కార్యాలయాల వద్ద నిరసన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

రాష్ట్రంలో విఒఎలపై జరుగుతున్న వేధింపులు, తొలగింపులు ఆపాలని సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు డిమాండ్ చేశారు. వేలేరుపాడు మండలంలో సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విఒఎల సంఘం ఆధ్వర్యంలో స్థానిక వెలుగు ఆఫీస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డ్వాక్రా సంఘాల గ్రూపులను ఎప్పటికప్పుడు నిరంతర పర్యవేక్షణ చేస్తున్న విఒఎలపై రాజకీయపరంగా ఒత్తిడిలు తీసుకువచ్చి, వారి ఉద్యోగ తొలగింపు ఆపాలని అన్నారు. అనేక కారణాలవల్ల తొలగించిన విఒఎలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, ఎస్‌కె.పర్వీన్, జి.సౌందర్య, బి.మాధవి, వై.ఉషా, జి.రమేష్, కె.లక్ష్మణరావు, సుమ, ఎం.శ్రీను, ఎస్.దుర్గారావు, ఎ.వెంకటేష్, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

చింతలపూడి : ప్రభుత్వాలు మారిన తర్వాత వెలుగు విఒఎలపై పాలక పార్టీ నాయకులు కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారని, జీతం భత్యం లేకుండా దశాబ్దాల తరబడి ప్రభుత్వాలకు వెట్టి చాకిరి చేశారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. చింతలపూడి పట్టణంలో బుధవారం వెలుగు విఒఎల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రదర్శనగా బయలుదేరి వెలుగు కార్యాలయం ముందు విఒఎలు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ, భానుమతి, కృష్ణకుమారి, వసంత, ఈశ్వరమ్మ, రాణి పాల్గొన్నారు.



జీలుగుమిల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న విఒఎలు

జీలుగుమిల్లి : వెలుగు విఒఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు అనుబంధ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని విఒఎల సిఐటియు అనుబంధ సంఘం మండల కార్యదర్శి చిట్టి బొమ్మ కొండలరావు అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నుంచి వెలుగు కార్యాలయం వరకు జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్లారు. అనంతరం వెలుగు ఎపిఎం కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఎన్.నాగేశ్వరరావు, జి.వెలువలమ్మ, డి.రత్నకుమారి, టి.దుర్గ భవాని, వై.వీరలక్ష్మి, బుర్ర నాగ ఝాన్సీ, జి.శ్యామల కుమారి పాల్గొన్నారు.

జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకాన్ని పెంచాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

200 యూనిట్లు విద్యుత్ వాడుతున్న దళిత, గిరిజన లబ్ధిదారులకు జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, దీన్ని 300 యూనిట్లకు పెంచాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లు విద్యుత్ వాడుతున్న దళిత, గిరిజన లబ్ధిదారులకు జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తుందని, అయితే పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల పరిధిలో దళిత, గిరిజన లబ్ధిదారులకు జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం లేదని తెలిపారు. 150 యూనిట్లు లోపు ఉన్న వారికి బిల్లులు ఎక్కువ చూపించి మీరు కరెంట్ బిల్లులు కట్టాలని, లేదంటే విద్యుత్ మీటర్లు తొలగిస్తామని బెదిరించి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బిల్లులు కట్టనివారి మీటర్లు తొలగించారని తెలిపారు. కొంతమంది మీటర్లు తొలిగిస్తే మరలా మీటర్ రావడం కష్టమని భయపడి బిల్లులు కట్టారని, ఈ విషయం స్థానిక అధికారుల దృష్టిలో పెట్టగా పై అధికారుల నిర్ణయాన్ని మేం అమలు చేస్తున్నామని చెప్పడం బాధకారమన్నారు. బుట్టాయగూడెం, రెడ్డి గణపవరం గ్రామాల్లో దళిత, గిరిజన ప్రాంతాల్లో రెండు లైట్లు, ఫ్యాన్, టివి ఉన్న ఇంటికి వందలోపు యూనిట్లు వస్తుందని, ఇంకో రూం అదనంగా ఉంటే 150 లోపు యూనిట్లు విద్యుత్ వాడకం వస్తుందని, అలాంటి ఇళ్లకు కూడా బిల్లులు కట్టాలని ఒత్తిడి చేస్తూ బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు పరిశీలన చేసి దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని, దళిత గిరిజనులను ఇబ్బందులు పెడుతున్న క్షేత్రస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జగజ్జీవన్ ఉచిత విద్యుత్ పథకాన్ని 200 యూనిట్లు నుంచి 300 యూనిట్లు పెంచి దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వం అన్నదాతలను ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం

ఏలూరు అర్బన్ : దళారులు రైతుల నుంచి ధాన్యాన్ని రూ.1400లకే కొనుగోలు చేస్తున్నారని, రైతు పండించే ధాన్యాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోళ్ల సమస్యలను జిల్లా మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో లక్ష 80 వేల ఎకరాలలో వరిపంట సాగు జరగగా 5 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా అయ్యిందన్నారు. ఇందులో 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు లక్ష్యంగా ప్రకటించారని చెప్పారు. రైతులు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం వల్ల మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాలో చాలాచోట్ల వ్యాపారుల మోసాలకు గురై రైతులు నష్టపోయారని వివరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. తేమ శాతం నిబంధనలు మార్పు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.జగదీష్, పి.దావీదు పాల్గొన్నారు.

క్రాడిల్ రిసెప్షన్ సెంటర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమాభివృద్ధి శాఖ ఏలూరు వారి ఆధ్వర్యంలో ఏలూరులోని కొత్త బస్టాండ్‌లో క్రాడిల్ రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ బుధవారం పునరుద్ధరించారు. ఈనెల 7వ తేదీన గర్భస్థ శిశుదినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా క్రాడిల్ రిసెప్షన్ సెంటర్, చంటి బిడ్డల తల్లులు పాలిచ్చే గదులను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా వద్దు అనుకున్న బిడ్డలను రోడ్డుపక్కన, కాలవల్లోనూ, చెత్త బుట్టలలోను విడిచిపెట్టకుండా ఇటువంటి ఉయ్యాలలో విడిచిపెట్టాలన్నారు. 1098 లేదా 100, 181 కానీ ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలని, అలా తెలియజేసిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఆ బిడ్డల రక్షణను అధికారులు తీసుకుంటారని, వారిని సంరక్షించడం లేదా చట్టప్రకారం దత్తత ఇవ్వడం చేస్తారని తెలియజేశారు. ఈ క్రాడిల్ రిసెప్షన్ సెంటర్లు కొత్త బస్టాండ్, గవర్నమెంట్ హాస్పిటల్, శిశుగృహంలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మావతి పాల్గొన్నారు.